తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం – 17 – నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 163 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

పాత ఇళ్ల పథకాల లబ్ధిదారులకు ఇంటి పట్టాలు తిరిగి ఇవ్వాలని ఆదేశాలు

2014కు ముందు ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఊరట

పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల వాపసుకు కలెక్టర్లకు ఆదేశం

సుమారు 7 లక్షల మందికి ప్రయోజనం

దశాబ్దకాల నిరీక్షణకు తెరదించేందుకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2014కు ముందు ఇందిరమ్మ సహా వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఆయా పథకాల లబ్ధిదారులకు గతంలో జారీ చేసిన ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తిరిగి అందించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుందని తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఉండిపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మంత్రి వివరించారు. దాదాపు దశాబ్దానికి పైగా తమ ఇంటి పత్రాలు తిరిగి అందలేదని లబ్ధిదారుల నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తనకు అనేక విజ్ఞాపనలు అందాయని చెప్పారు. ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం,

మిగతా 2 లో..



కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేస్తోంది: హరీశ్‌రావు

- **తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చడంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది**
- **మూడేళ్లలో కొత్త ప్రాజెక్టు నిర్మించలేదని మాజీ మంత్రి విమర్శ**
- **సిద్దిపేటలో రైతులకు రుణమాఫీ కాని వారి సంఖ్యే అధికమని వెల్లడి**
- **ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ విడుదల**



సిద్దిపేట, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాలు, కమీషన్ల కోసం మార్చారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, ఒక అబద్ధాన్ని పదేపదే చెబితే నిజమవుతుందన్న రీతిలో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలోనే అన్ని ఆధారాలతో సమాధానం ఇచ్చామని, తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని అప్పట్లోకేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతి, కేంద్ర జల సంఘం లేఖలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించామని తెలిపారు. నీళ్లు లేని ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మించకుండా, నీటి లభ్యత ఉన్న ప్రాంతానికి మార్చి గత ప్రభుత్వం ప్రజాధనాన్ని సద్వినియోగం చేసిందని పేర్కొన్నారు.మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో పనులు చేయకుండానే బిల్లులు తీసుకుని కమీషన్లు పొందారని హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

మిగతా 2 లో..



దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయ ఉపకరణాలు: మంత్రి పొన్నం ప్రభాకర్

- **హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్ధారణ శిబిరం ప్రారంభం**
- **అలింకో సంస్థ సహకారంతో ప్రత్యేక కార్యక్రమం**
- **అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఏర్పాట్లు**
- **ప్రతి ఒక్కరికీ సహాయ ఉపకరణాలు అందించడమే లక్ష్యం**

కరీంనగర్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): హుస్నాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలో అలింకో సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. అర్హులైన వారిని గుర్తించి వారికి అవసరమైన సహాయ ఉపకరణాలు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. దివ్యాంగులు, వృద్ధులు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు అవసరమైన పరికరాలను

మిగతా 2 లో..


అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

- **మంత్రి వివేక్ వెంకటస్వామి**
- **1,924 మందికి కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు**
- **523 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ**
- **దుబ్బాకకు రెండో విడతలో మరో 2 వేల ఇళ్లు మంజూరు**
- **రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు**

సిద్దిపేట, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.

మిగతా 2 లో..





హరీశ్‌రావు అవినీతి ఆరోపణలపై నిగ్గు తేల్చాలి: కల్వకుంట్ల కవిత


- **ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపరంగానూ పోరాటం**
- **ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సీబీసీఐడీ, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు పంపిస్తాం**
- **కరువు పరిస్థితులపై ప్రధానికి వివరించని సీఎం రేవంత్‌రెడ్డి**
- **రాష్ట్రవ్యాప్తంగా త్వరలో భైరవ వాహనంలో యాత్ర**

నిజామాబాద్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): మాజీ మంత్రి హరీశ్‌రావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

మిగతా 2 లో..

దివ్యాంగుల సేవలో స్వయంకృషి సంస్థ కృషి అభినందనీయం

- **జవహర్‌నగర్‌లో స్వయంకృషి సంస్థను సందర్శించిన సీతక్క**
- **మూడు దశాబ్దాలుగా లాభాపేక్ష లేకుండా సేవలు**



మేడ్చల్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):

దివ్యాంగులకు మూడు దశాబ్దాలకు పైగా లాభాపేక్ష లేకుండా సేవలందిస్తున్న స్వయంకృషి సంస్థ కృషి అభినందనీయమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లోని స్వయంకృషి సంస్థను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి, దివ్యాంగులకు అందిస్తున్న సహకారం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇన్నేళ్లుగా దివ్యాంగుల సంక్షేమం కోసం

మిగతా 2 లో..

తెలంగాణ ఉద్యమ పాదయాత్రకు 15 ఏళ్లు

- **రాష్ట్ర సాధనే లక్ష్యంగా చారిత్రాత్మక అడుగులు**
- **ఉమ్మడి జిల్లాల వారీగా పాదయాత్రలకు శ్రీకారం**
- **కేటీఆర్ నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో యాత్ర**



హైదరాబాద్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచిన పాదయాత్రలకు నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా 2011 నవంబర్ 16న అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా పాదయాత్రలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఆనాడు చేపట్టిన పాదయాత్రల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సాగిన యాత్ర ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేస్తోంది: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఆ విధానాన్ని రద్దు చేసి పారదర్శకంగా పనులు చేపట్టిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో, మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఏడేళ్లపాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు తీసుకురాకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ సైతం ప్రాజెక్టుపై ఖర్చు వృథా అవుతుందని లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ చేసిన ఆలస్యాన్ని ప్రస్తావించకుండా ఇప్పుడు బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వేలాది చెక్‌డ్యామ్‌లు, ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు చెరువుల పునరుద్ధరణ చేపట్టి లక్షల ఎకరాలకు సాగునీరు అందించిందని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో కొత్తగా ఒక్క ప్రాజెక్టు నిర్మించిందా, కొత్తగా ఒక్క ఎకరానికి నీరు అందించిందా, ఒక్క చెరువైనా తవ్వించిందా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించింది శూన్యమని విమర్శించారు. దేవాదుల, కాళేశ్వరం, సీతమ్మ సాగర్, సమ్మక్క బ్యారేజీ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తయి ఉంటే కరువును ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉండేదన్నారు. కృష్ణా జలాలను వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, మూడేళ్లలోనే అత్యల్పంగా నీటిని ఎత్తిపోసిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. వానాకాలంలో 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం మానుకుని, గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల చివరి దశ పనులను పూర్తి చేసి వాటి పూర్తి ఆయకట్టుకు నీరు అందించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న నేపథ్యంలో ప్రజల తరఫున బహిరంగ లేఖ విడుదల చేయనున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనతో ప్రజలకు మేలు జరుగుతుందని, ఇచ్చిన హామీలు నెరవేరుతాయని ఆశిస్తారని అన్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా సిద్దిపేటకు వచ్చినప్పుడు మల్లన్న సాగర్, వైద్య కళాశాల, జిల్లా కలెక్టరేట్లను ప్రారంభించారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు సిద్దిపేటకు వచ్చినా ప్రజలకు ప్రయోజనం చేకూర్చే నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. 2024 మే 2న అంబేద్కర్ చౌరస్తా వద్ద కొమురవెల్లి మల్లన్న సాక్షిగా ఆగస్టు 15లోపు రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని, అయినప్పటికీ ఇప్పటికీ అనేక మంది రైతులకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు.

సిద్దిపేట నియోజకవర్గంలో 20,514 మందికి మాత్రమే రుణమాఫీ కాగా, 22,819 మందికి రుణమాఫీ కాలేదని హరీశ్‌రావు వెల్లడించారు. రుణమాఫీ అవుతుందన్న ముఖ్యమంత్రి మాటలను నమ్మి రెండు లక్షల రూపాయలకు మించి అప్పులున్న రైతులు అదనపు అప్పులు చేసి బ్యాంకుల్లో చెల్లింపులు చేశారని, వారంతా ఇబ్బందుల్లో పడ్డారని అన్నారు. ముఖ్యమంత్రి మరోసారి సిద్దిపేటకు వస్తున్నందుకు స్వాగతం పలుకుతున్నామని, అయితే ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసి రావాలని కోరారు. రైతులందరికీ రుణమాఫీ చేసిన తర్వాతే సిద్దిపేటకు రావాలని, అలా వస్తే తానే స్వయంగా పుష్పగుచ్ఛం అందజేస్తానని వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రైతులకు ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి పదవికి గౌరవం తీసుకురావాలని హరీశ్‌రావు కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా 1,924 మంది లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను, మరో 523 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చాలాకాలంగా పింఛన్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులందరికీ చేయూత అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరు విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. పింఛన్ల మంజూరు ప్రక్రియను అర్హుల అవసరాలకు అనుగుణంగా కొనసాగిస్తామని వెల్లడించారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని వివేక్ వెంకటస్వామి తెలిపారు. దుబ్బాక నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2,000 ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు సొంత గృహం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేద కుటుంబాలకు స్థిరమైన నివాసం లభిస్తుందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

ప్రజల రోజువారీ అవసరాలు, ఆరోగ్యం, ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం, పేదలకు సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని తెలిపారు. ఈ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

దుబ్బాక నియోజకవర్గంలో విద్యా రంగ అభివృద్ధికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసినట్లు వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ఈ పాఠశాల ఉపయోగపడుతుందని తెలిపారు. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల భారాన్ని అధిగమిస్తూ కూడా ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు పింఛన్ భరోసా, ప్రతి కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించడంతో పాటు అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయ ఉపకరణాలు: మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా అందించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారుల అవసరాలను పరిశీలించి వారికి తగిన ఉపకరణాలను గుర్తించేలా నిర్ధారణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. సహాయ ఉపకరణాలు అందడం వల్ల వారి రోజువారీ పనులు సులభతరమవుతాయని, ఇతరులపై ఆధారపడే పరిస్థితి కొంతవరకు తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని సూచించారు. సైదాపూర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అలింకో సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. శిబిరం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందేలా నిర్ధారణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారికి అవసరమైన సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగుల సేవలో స్వయంకృషి సంస్థ కృషి అభినందనీయం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయడం గొప్ప విషయమని మంత్రి పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకు పైగా సేవా దృక్పథంతో సంస్థను కొనసాగిస్తున్న నిర్వాహకులు, సిబ్బందిని అభినందించారు. సమాజంలో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు అండగా నిలవడం, వారికి అవసరమైన సహాయం అందించడం ఎంతో బాధ్యతతో కూడిన సేవ అని అన్నారు.

సంస్థలో దివ్యాంగుల్లో కనిపించిన ఆత్మవిశ్వాసం, వారి ముఖాల్లోని చిరునవ్వులు తనను ఎంతగానో కదిలించాయని సీతక్క తెలిపారు. ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా తమ సామర్థ్యాలను గుర్తించి ముందుకు సాగేందుకు ఇలాంటి సంస్థలు అందిస్తున్న సేవలు కీలకమని అభిప్రాయపడ్డారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి అన్నారు. విద్య, ఉపాధి, సామాజిక భాగస్వామ్యం వంటి రంగాల్లో వారికి తగిన అవకాశాలు అందినప్పుడే సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. దివ్యాంగుల కోసం నిరంతరం సేవలందిస్తున్న స్వయంకృషి వంటి సంస్థలకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీతక్క హామీ ఇచ్చారు. ఇలాంటి సేవా సంస్థలకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తూ, దివ్యాంగుల గౌరవం, సమాన హక్కులు, అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. సంస్థ సేవలను కొనసాగిస్తున్న బృందానికి మరోసారి అభినందనలు తెలిపారు.

పాత ఇళ్ల పథకాల లబ్ధిదారులకు ఇంటి పట్టాలు తిరిగి ఇవ్వాలని ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారుల వద్దకు వారి ఇంటి పత్రాలను తిరిగి చేర్చాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలో 22ఏ భూముల అంశంపై సమీక్షలు జరుగుతున్న సమయంలో తహసీల్దార్ కార్యాలయాల్లో లబ్ధిదారుల ఇంటి పట్టాలు పెద్ద సంఖ్యలో ఉన్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిందని పొంగులేటి తెలిపారు. వెంటనే ఆ పత్రాలను పేదలకు తిరిగి అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేశామని, వివిధ కారణాలతో ఇప్పటివరకు పత్రాలు అందని అర్హులైన లబ్ధిదారులకు వాటిని తిరిగి ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

2014కు ముందు అమలైన గృహ నిర్మాణ పథకాలలో ప్రభుత్వ సబ్సిడీతో పాటు లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణాల ద్వారా ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించేవారని మంత్రి వివరించారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందే సమయంలో లబ్ధిదారుల ఇంటి పట్టాలను షూరిటీగా ఉంచుకునేవారని తెలిపారు. రుణ వాయిదాలన్నీ సక్రమంగా చెల్లించి మొత్తం రుణాన్ని తిరిగి చెల్లించిన వారికి ఆ పత్రాలను వెనక్కి ఇచ్చే విధానం ఉండేదని చెప్పారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం నిలిచిపోవడంతో కొంతమంది లబ్ధిదారులకు వారి ఇంటి పట్టాలు తిరిగి అందలేదన్నారు.

వివిధ కారణాలతో తనఖాలో ఉన్న పత్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనే మిగిలిపోయిన పట్టాలను అర్హులైన లబ్ధిదారులకు తిరిగి అందించాల్సి ఉందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పేదల సొంతింటిపై హక్కును మరింత భద్రం చేయడంతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే ఈ నిర్ణయం ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఏళ్ల తరబడి ఇంటి పత్రాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది కుటుంబాలకు ఉపశమనం కలగనుంది.

హరీశ్‌రావు అవినీతి ఆరోపణలపై నిగ్గు తేల్చాలి: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ అంశంపై ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగించడంతో పాటు చట్ట పరంగా, న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరిస్తామని స్పష్టం చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆమె మీడియాతో మాట్లాడారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సేకరించి సీబీసీఐడీతో పాటు కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు కూడా పంపిస్తామని వెల్లడించారు. తప్పు చేసిన వారెవరైనా చట్ట ప్రకారం శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సమస్యలపై తగిన శ్రద్ధ చూపడం లేదని కవిత విమర్శించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. పంటల పరిస్థితి, వ్యవసాయ రంగానికి అవసరమైన సహాయం గురించి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావించకపోవడం అన్యాయమని వ్యాఖ్యానించారు.

పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లు అంశాన్ని కూడా ప్రధానమంత్రి వద్ద ప్రస్తావించకపోవడంపై కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనపెట్టి కాంట్రాక్టులు, కమీషన్ల గురించే ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు మండలాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు పంటలు వేయవద్దని సూచించే పరిస్థితి రావడం ఆందోళనకరమని, పంటలు సాగు చేయకపోతే రైతులకు ప్రభుత్వం ఎలాంటి పరిహారం అందిస్తుందో స్పష్టం చేయాలని కోరారు. సాగు చేయని ప్రతి ఎకరానికి రూ.25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడమే తమ పార్టీ లక్ష్యమని కవిత తెలిపారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా త్వరలో భైరవ వాహనంలో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, వారి సమస్యలను తెలుసుకోవడం ఈ యాత్ర ఉద్దేశమని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, కనీసం జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పట్టభద్రులను కోరారు.

ఇదే సమయంలో ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కవిత తప్పుబట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగానికి సంబంధించిన వర్గాలతో చర్చించకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై మంగళవారం తమ పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, సామాజిక న్యాయం కోసం తమ పార్టీ ముందుకు సాగుతుందని కవిత వెల్లడించారు.


రాహుల్ గాంధీతో తెలంగాణ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ బి.ఎం. సందీప్ భేటీ

- **తెలంగాణ బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వక కలయిక**
- **లోక్‌సభ ప్రతిపక్ష నేతతో సమావేశం**
- **ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా ఇటీవల నియామకం**
- **సందీప్ భేటీపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి**

న్యూఢిల్లీ, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన బి.ఎం. సందీప్ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. నేడు జరిగిన ఈ భేటీలో సందీప్ రాహుల్ గాంధీని కలిసి తన నియామకం అనంతరం శుభాకాంక్షలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యతలను బి.ఎం. సందీప్‌కు ఏఐసీసీ అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆయన రాహుల్ గాంధీతో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేతతో ఆయన భేటీ అయ్యారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల్లో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు కీలకంగా ఉంటాయి. రాష్ట్ర పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌ఛార్జ్ బాధ్యతల్లో భాగంగా ఉంటుంది.

రాహుల్ గాంధీతో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశానికి సంబంధించిన వివరాలను బి.ఎం. సందీప్ తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా వెల్లడించారు. తెలంగాణ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేతను కలిసిన విషయాన్ని తెలియజేశారు. ఈ భేటీకి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది. తెలంగాణలో పార్టీ బాధ్యతలు చేపట్టిన సందీప్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ఎలా ముందుకు తీసుకెళ్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



తెలంగాణ ఉద్యమ పాదయాత్రకు 15 ఏళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వికారాబాద్ నుంచి కుత్బుల్లాపూర్ వరకు పాదయాత్ర కొనసాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల మీదుగా సాగిన ఈ యాత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలకు వివరించడంతో పాటు ప్రత్యేక రాష్ట్రం కోసం సాగుతున్న ఉద్యమానికి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. తెలంగాణ సాధనే ప్రధాన లక్ష్యంగా సాగిన ఈ పాదయాత్రలు ఉద్యమ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఉమ్మడి జిల్లాల స్థాయిలో కార్యక్రమాలు చేపట్టడం ద్వారా తెలంగాణ ఆకాంక్షను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం కలిగింది. ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషించాయి. 2011 నవంబర్ 16న ప్రారంభమైన ఆ పాదయాత్రలు తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. రాష్ట్ర సాధన కోసం నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి, ప్రజల్లో నెలకొన్న ఆకాంక్ష, ఉద్యమ సమయంలో కనిపించిన ఐక్యత ఆనాటి జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తు చేస్తున్నాయి. ఆ పోరాటంలో భాగమైన పాదయాత్రలు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమ ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచిపోయాయి. పాదయాత్రలు ప్రారంభమై 15 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఆ పోరాటంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తల కృషిని ఉద్యమ అభిమానులు స్మరించుకుంటున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో బలంగా నిలిపిన ఆనాటి ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమని గుర్తుచేసుకుంటున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 17 - నవంబర్ 2026
వరంగల్ 03

మండలంలో 577 మందికి నూతన చేయూత పెన్షన్లు

- **ఎమ్మెల్యే చేతుల మీదుగా పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ**




పెద్దమందడి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వం సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకంలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి కొత్తగా 577 పెన్షన్లు మంజూరయ్యాయి. ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు ప్రభుత్వం ఈ పెన్షన్లను మంజూరు చేసింది.నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని నవంబర్ 17వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు పెద్దమందడిలోని చెన్నకేశవ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు ఉత్తర్వులను అందజేయనున్నారని పెద్దమందడి ఎంపీడీవో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దమందడి మండలంలోని అన్నిగ్రామ పంచాయతీల సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, పత్రికా ప్రతినిధులు, నూతన పెన్షన్ లబ్ధిదారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.



గ్రామ రహదారి సమస్యపై ప్రజావాణిలో సర్పంచ్ ఫిర్యాదు

వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో నెలకొన్న రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ మేకల రాములు యాదవ్, ఉప సర్పంచ్ రవి సాగర్ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.గ్రామంలోని పంట పొలాలకు, అక్కడి నుంచి పెద్దమందడి ప్రధాన రహదారికి వెళ్లే దారిలో ఓ రైతు అడ్డంకులు సృష్టిస్తూ రహదారి మరమ్మతు పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత 70 సంవత్సరాలుగా గ్రామస్థులు, బాటసారులు వినియోగిస్తున్న ఈ దారిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా మ్మతు పనులు చేపట్టేందుకు గ్రామస్థుల అభ్యర్థన మేరకు సంబంధిత అధికారులు సహకరించాలని జిల్లా అధికారులను విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారులు మండల స్థాయి అధికారులకు విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సర్పంచ్, ఉప సర్పంచ్ మండల స్థాయి అధికారులకు మరోసారి అర్జీ సమర్పించారు.ఇదిలా ఉండగా, అదే సమస్యపై సంబంధిత రైతు సైతం ప్రజావాణిలో తన వాదనను అధికారుల ముందు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న అధికారులు గ్రామస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవ పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.



దీక్షా దివస్ స్ఫూర్తి సభకు చొప్పదండి నుంచి వేలాదిగా తరలిరావాలి

- **ఈ నెల 29న అలుగునూరులో సభ**
- **దీక్షా దివస్‌తో తెలంగాణ ప్రజలను ఏకం చేసిన వ్యక్తి కేసీఆర్**
- **ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్:మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

చొప్పదండి, నవంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూరులో నిర్వహించే దీక్షా దివస్ స్ఫూర్తి సభకు చొప్పదండి నియోజకవర్గం నుంచి వేలాదిగా ప్రజలను తరలించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు.ఈ మేరకు గంగాధర మండలం బూరుగుపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

సగరులను బీసీ-ఏలో చేర్చాలి

- **జిల్లా అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్**



వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):విద్యా, ఉపాధి, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్న సగరులను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని సగర సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వనపర్తి జిల్లా కలెక్టరేట్ వద్ద సగర సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, బీసీ సంక్షేమ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతయ్య సాగర్ మాట్లాడుతూ సగరులు తరతరాలుగా కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, నిర్మాణ పనులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి దినసరి కూలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. విద్యా, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో తీవ్ర వెనుకబాటుకు గురవుతున్నారని పేర్కొన్నారు.బీసీడీ విభాగంలో ఇతర కులాలతో పాటు ఉండటం వల్ల సగరులకు తగిన అవకాశాలు లభించడం లేదని అన్నారు. సగరుల వాస్తవ జీవన పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, సామాజిక వెనుకబాటుతనంపై సమగ్ర అధ్యయనం నిర్వహించి బీసీఏ విభాగంలో చేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే జీవో 59ను సవరించి ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో సగరులకు రిజర్వేషన్ శాతం పెంచాలని, సగరులను నిర్మాణ రంగ కార్మికులుగా గుర్తించి ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయడంతో పాటు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సగరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొబ్బూరి చంద్రయ్య, జిల్లా కోశాధికారి గుంటి సత్యం సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక సత్యం సాగర్, రాష్ట్ర కోశాధికారి చీర్ల విష్ణు, గోల్డెన్ సిటీ ఆర్.కె.రవి సాగర్, మహిళా మాజీ అధ్యక్షురాలు మహేశ్వరి సాగర్, రాష్ట్ర నాయకుడు పెబ్బేరు శ్రీనివాసులు సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా ముఖ్య సలహాదారు పల్లె సత్యనారాయణ, వనపర్తి పట్టణ అధ్యక్షుడు బుజ్జన్న, సంస్కృత విభాగం అధ్యక్షుడు నాగేంద్రం, జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మాజీ లీగల్ అడ్వైజర్ సుజనా సాగర్, వనపర్తి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చీర్ల శ్రీనివాసులు, మాజీ పట్టణ అధ్యక్షుడు పెద్ద నాగులు, మరికుంట అధ్యక్షుడు నాగరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాసులు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, సగర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాల పోరాట ఫలితం

- **బుక్కపురం మహేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి**



వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు-):ఎస్సీ వర్గీకరణ ద్వారా లభిస్తున్న రిజర్వేషన్ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మాదిగ విద్యార్థులు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఎస్ఎఫ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి బుక్కపురం మహేష్ మాదిగ పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లా కేంద్రంలోని అభయాస్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్‌లో మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సదస్సుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోఇన్‌చార్జి మొలకలపల్లి పరుశరాముడు మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బుక్కపురం మహేష్ మాదిగ, జిల్లా కోఇన్‌చార్జి మీసాల గణేష్ మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా బుక్కపురం మహేష్ మాదిగ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కుల వివక్షత రూపాలు మారుతున్నప్పటికీ సమాజంలో కుల వివక్షత పూర్తిగా అంతం కాలేదన్నారు. కుల వ్యవస్థ నుంచి ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ మాదిగ విద్యార్థులు ఆత్మవిశ్వాసం, సంకల్పబలంతో ముందుకు సాగాలని సూచించారు.మాదిగ జాతి విద్యా, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం చేశారని, ఆ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ చట్టం సాధ్యమైందని పేర్కొన్నారు. వర్గీకరణ ద్వారా అందుబాటులోకి వచ్చిన 9 శాతం రిజర్వేషన్ అవకాశాలను వినియోగించుకొని మాదిగ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. విద్యార్థులు వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభ్యున్నతికి కూడా కృషి చేయాలని, మహనీయుల ఆశయాల సాధన కోసం ప్రతి మాదిగ విద్యార్థి ఎంఎస్ఎఫ్‌లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మహనీయుల బాట, మందకృష్ణ మాదిగ మాట విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని, విద్యార్థులు ఐక్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అన్నారు.సదస్సు సందర్భంగా అభయాస్ జూనియర్ కళాశాల ఎంఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కళాశాల అధ్యక్షుడిగా రేపల్లి ధనుష్ మాదిగ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిని నాయకులు అభినందించి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ఎంఎస్ఎఫ్ సంస్థ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షుడు, ఎంఎస్ఎఫ్ వనపర్తి జిల్లా కోఇన్‌చార్జి కొమ్ము చెన్నకేశవులు మాదిగ, పుట్టపగ అజయ్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సీనియర్ నాయకుడు గంధం గట్టయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించడం అభినందనీయం

- **పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



వనపర్తి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు):కంటిచూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ సమయానికి కంటి పరీక్షలు చేయించుకోవాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ సూచించారు.వనపర్తి పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఉన్న వనితా జ్యోతి మహిళా సంఘం కార్యాలయం వద్ద లైఫ్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, హైదరాబాద్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ శిబిరానికి పలుస శంకర్ గౌడ్ హాజరై వైద్య సేవలందించిన వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ ఎ.కె. ఖమ్రరహమాన్ వనితా జ్యోతి మహిళా సంఘం ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ పేద ప్రజలకు అండగా నిలవడం ప్రశంసనీయమని కొనియాడారు. వనితా జ్యోతి మహిళా సంఘం తెలంగాణ స్వచ్ఛంద సంస్థ ముఖ్య కార్యనిర్వాహకులు డాక్టర్ ఎ.కె. ఖమ్రరహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 50 మంది ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాస్, సోహెల్, చిట్టెమ్మ, రహమాన్, ఆసుపత్రి వైద్య బృందానికి చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్, సయ్యద్ ఫజల్ హుస్సేన్, సుహానా పర్వీన్, మహజబీన్, ఆయేషా జబీన్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



చిన్నారి శ్రీనిధికి ఆశీస్సులు అందించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి


పెద్దమందడి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు): పెద్దమందడి మండల కేంద్రంలోని 7వ వార్డు సభ్యుడు కొమ్ము బ్రహ్మయ్య స్వగృహంలో నిర్వహించిన చిన్నారి శ్రీనిధి పుష్పాలంకరణ మహోత్సవ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారి శ్రీనిధిని ఆశీర్వదించి, ఆమె తల్లిదండ్రులు కొమ్ము బ్రహ్మయ్య, కృష్ణవేణి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.చిన్నారి శ్రీనిధి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ఆహ్వానించిన కుటుంబ సభ్యులను అభినందించారు.ఈ వేడుకలో గ్రామ అధ్యక్షుడు టీ సేనాపతి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పురుషోత్తం రెడ్డి, మండల అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి, వార్డు సభ్యురాలు సింగిరెడ్డి అమల, గొల్ల మౌగిలయ్య, గొడుగు రామచంద్రయ్య, కొమ్ము బాలనాగన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ బాలయ్య**

పెద్దమందడి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు): ప్రతి ఒక్కరికీ న్యాయం అందించాలనే లక్ష్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎ. బాలయ్య సూచించారు.వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒక మారుమూల గ్రామాన్ని ఎంపిక చేసి 60 రోజుల పాటు ప్రత్యేక న్యాయ సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా గట్ల ఖానాపూర్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షన్లు, లేబర్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని అర్హులైన వారికి అవసరమైన న్యాయపరమైన సహాయం అందించనున్నట్లు వివరించారు.గ్రామస్థుల సౌకర్యార్థం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉన్నా ఉచిత న్యాయ సహాయం కోసం నల్సా హెల్ప్‌లైన్ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి.కృష్ణయ్య, మండల తహసీల్దార్ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి శరత్ చంద్ర, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు పెన్షన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

- **వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించాలి ప్రకటనల ఆదాయంలో 10 శాతం నిధికి కేటాయించాలి**
- **ప్రభుత్వం మరో 3 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలి**

కరీంనగర్,నవంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ వృద్ధాప్యంలో ఆర్థిక భరోసాతో పాటు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రత్యేకంగా జర్నలిస్టుల పెన్షన్, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని సీనియర్ జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం జర్నలిస్టులు చేపట్టిన ఉద్యమంలో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తనాజీ వాకాడేకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ..సమాజానికి నిరంతరం సమాచారాన్ని అందిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్, సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రయోజనం చేకూర్చేలా సమగ్ర పథకాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధి ఏర్పాటు కోసం అర్హత కలిగిన పత్రికలు, మీడియా సంస్థలకు వచ్చే ప్రకటనల ఆదాయంలో 10 శాతం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం మ్యాచింగ్ గ్రాంట్ అందించాలని కోరారు.నిధుల నిర్వహణలో పారదర్శకత ఉండేలా ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి, ఆదాయ వ్యయాలకు సంబంధించి క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలని సూచించారు.

మల్లికుదుర్లలో వీబీజీ రామ్ జి పనులపై సర్పంచ్ ఆకస్మిక తనిఖీ

- **పండ్ల తోటల పెంపకంతో రైతులకు ఆర్థికాభివృద్ధి – సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్**



వేలేరు, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు-):వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో వీబీజీ రామ్ జి పథకం అమలులో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక - సంపత్ యాదవ్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టికల్చర్ (ఉద్యానవన) అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పండ్ల మొక్కల పెంపకం కోసం తీస్తున్న గుంతల పనులను పరిశీలించి, పనుల పురోగతిపై ఆరా తీశారు.
గ్రామంలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె సూచించారు





ప్రజాదివాస్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం బ్యూరో, నవంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజాదివాస్) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు 25 మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన పలువురు బాధితులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.
ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన

- **సమస్యలు, సందేహాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచన**



వేలేరు, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): వేలేరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు, సందేహాలు లేదా ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు.
విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులతో మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ కిషన్ నాయక్, ఎంఈఓ చంద్రమౌళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఘనంగా ఛఠ్ పూజ వేడుకలు

- **సూర్యభగవానుడి ఆరాధనతో పాటు ప్రకృతి పరిరక్షణ, కుటుంబ సంక్షేమానికి ఛఠ్ పూజ ప్రతీక – నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): సూర్యభగవానుడి ఆరాధన, ప్రకృతి పరిరక్షణ, కుటుంబ సంక్షేమం, సామాజిక మానవత్వం, మహిళల నిబద్ధత, వ్యవసాయ సంస్కృతి, సంప్రదాయాలకు ఛఠ్ పూజ ప్రతీకగా నిలుస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. కార్తీకమాస శుక్లపక్ష షష్ఠి తిథి సందర్భంగా సోమవారం కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి చెరువు ప్రాంతంలో ఛఠ్ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.
ఈ వేడుకలకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రవాస మహిళలతో కలిసి సంప్రదాయబద్ధంగా సూర్యభగవానుడు, షష్ఠి దేవికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్ఘ్యం సమర్పించారు. అనంతరం నిర్వాహకులు మేయర్‌కు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ ఉత్తరప్రదేశ్ ప్రవాస మహిళలకు, ప్రజలకు ఛఠ్ పూజ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా నగరంలో నాలుగు రోజుల పాటు ఛఠ్ ఉత్సవాలను అత్యంత నియమనిష్ఠలతో నిర్వహించారు. నదులు, చెరువుల వంటి పవిత్ర జలాశయాల్లో స్నానాలు ఆచరించి, వివిధ రకాల వంటకాలు, రొట్టెలు, పండ్లు, పూలు, చెరకు తదితర పూజా సామగ్రిని వెదురు బుట్టల్లో ఉంచి ఛఠ్ పాటలు పాడుతూ ఉదయించే, అస్తమించే సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పించడం ఈ పండుగ ప్రత్యేకత. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం విశేషం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 17 - నవంబర్ 2026

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

- **కర్రతో దాడికి యత్నించినట్లు బాధితురాలి ఫిర్యాదు**

వేలేరు, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): వేలేరు గ్రామంలో మహిళను అసభ్య పదజాలంతో దూషించి, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై వేలేరు పోలీసులు కేసు నమోదు చేశారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరు గ్రామానికి చెందిన పుట్టా రోజా (30) ఈ నెల 14వ తేదీ సాయంత్రం తన మొక్కజొన్న పంటను ఆరబెట్టిన ప్రదేశం వద్దకు ఆవులు రావడంతో వాటిని నిలువరించాలని కేకలు వేసింది. దీంతో ఆవులను అక్కడి నుంచి తోలుకెళ్లారు.ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న ఆమె బావ పుట్టా తిరుపతి (33) అదే రోజు సాయంత్రం రోజాను అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ, అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడని, అంతేకాకుండా బెదిరింపులకు పాల్పడి కర్రతో కొట్టేందుకు ప్రయత్నించాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు వేలేరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ చేపట్టారు.



ఢిల్లీ జాతీయ స్థాయి ఉపాధ్యాయ శిక్షణకు ఎంపికైన టి. సూర్యకుమారి

ఖమ్మం బ్యూరో, నవంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు): ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి ఖమ్మం జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు టి. సూర్యకుమారి ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు. ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, శాంతినగర్ సముదాయ పరిధిలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ, ప్రస్తుతం సంభానీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతినియామకంపై విధులు నిర్వహిస్తున్న ఎస్.జి.టి. ఉపాధ్యాయురాలు టి. సూర్యకుమారి ఈ శిక్షణకు ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సాంస్కృతిక వనరులు, శిక్షణ కేంద్రం నిర్వహించనున్న ఈ జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం 2026 నవంబర్ 18 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనుంది. జాతీయ విద్యా విధానం2020కు అనుగుణంగా విద్యాబోధనలో తోలు బొమ్మలాట పాత్ర అనే అంశంపై ఈ శిక్షణ నిర్వహించనున్నారు. విద్యాబోధనలో తోలుబొమ్మలాట వంటి సృజనాత్మక కళారూపాలను అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శిక్షణ ద్వారా నూతన బోధనా పద్ధతులను నేర్చుకొని పాఠశాల స్థాయిలో అమలు చేయడం ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా అర్బన్ మండల విద్యాశాఖాధికారి శైలజాలక్ష్మి, సముదాయ ప్రధానోపాధ్యాయులు చల్లగాని కృపాబాలానందం, సంభానీనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గురిజాల గౌరి, ఉపాధ్యాయులు పర్వీన్, ఉషా, కె. మీనా తదితరులు టి. సూర్యకుమారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకొని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి గుర్తింపులు సాధించాలని ఆకాంక్షించారు.

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీపై లయోలా కళాశాల విద్యార్థుల కేస్ స్టడీ

జమ్మికుంట, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):వ్యవసాయ మార్కెట్ కమిటీ నిర్వహణ, రైతుల పంటల క్రయవిక్రయాల విధానాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో లయోలా కళాశాల, అల్వాల్, సికింద్రాబాద్‌కు చెందిన విద్యార్థులు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించారు. కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంటలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు శిక్షణలో భాగంగా మార్కెట్ కమిటీ కార్యకలాపాలపై ప్రత్యేక కేస్ స్టడీ నిర్వహించారు.
ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్‌లో పంటల కొనుగోళ్లు, అమ్మకాలు, క్రయవిక్రయాల విధానం, మార్కెట్ కమిటీ నిర్వహణ తదితర అంశాలపై అధ్యయనం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానం, రైతులకు మార్కెట్ ద్వారా అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, మార్కెట్ కార్యదర్శి ఆర్. మల్లేశం, మార్కెట్ డైరెక్టర్ తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యార్థులకు మార్కెట్ కమిటీ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు.

బెజ్జంకిలో ఘనంగా నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

- **అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరాలి – ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ**



మానకొండూర్, నవంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు): మానకొండూర్ నియోజకవర్గం బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా డా. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు ప్రయోజనం చేకూరాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.
ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇలాంటి సంక్షేమ పథకాలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.
నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ పత్రాలను అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు, స్థానిక నాయకులు, సహకార సంఘం బాధ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదల జీవితాలో 'చేయూత' వెలుగులు.. కొత్త పెన్షన్ల మంజూరు

- **కరీంనగర్‌లో 3,812 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరు**
- **66 డివిజన్ల పరిధిలో లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ**
- **వృద్ధులకు కూడా పెన్షన్లు మంజూరు చేయాలి – డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



కరీంనగర్, నవంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో 'చేయూత' పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 66 డివిజన్లలో కొత్తగా ఎంపికైన 3,812 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పెన్షన్ పత్రాలను మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సయ్య ఆయా డివిజన్ల పాలకవర్గ సభ్యులతో కలిసి అందజేశారు.
నగరపాలక సంస్థకు మొత్తం 6,018 దరఖాస్తులు రాగా, వాటిలో 3,812 పెన్షన్లు మంజూరయ్యాయి. ఇందులో వితంతు పెన్షన్లు 2,180, వికలాంగుల పెన్షన్లు 1,046, ఒంటరి మహిళల పెన్షన్లు 467, చేనేత కార్మికులకు 47, గీత కార్మికులకు 72 మంజూరయ్యాయి. మరో 200 దరఖాస్తులకు సంబంధించి 360 డిగ్రీల కోణంలో విచారణ పూర్తిచేసి అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. పెన్షన్ మంజూరు పత్రాలు అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాల ఫలాలను అందించడమే ప్రభుత్వాల లక్ష్యమని అన్నారు.
డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు ఐదు లక్షల జనాభా ఉందని, గతంలో ఉన్న ప్రభుత్వాలు కూడా పేదలకు సేవ చేయాలనే ఆలోచనతో ఇప్పటివరకు నగరంలో సుమారు 28,400 మందికి పెన్షన్లు అందించాయని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా కొత్త పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన అనేకమంది పేదలు దరఖాస్తులు సమర్పించి ఎదురు చూశారని, పెన్షన్లు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.
ప్రభుత్వం ఏర్పడిన మూడేళ్ల తర్వాత కొత్తగా పెన్షన్లు మంజూరు చేసి పేదలకు చేయూత అందించడం సంతోషకరమని అన్నారు. పేదలకు అండగా నిలిచి చేయూత పెన్షన్లు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల తరపున అభినందనలు తెలిపారు.
అయితే, వృద్ధులను పెన్షన్ల జాబితాలో మినహాయించడం బాధాకరమని, సమాజంలో ఆదరణకు నోచుకోని వృద్ధులు ఎంతోమంది ఉన్నారని అన్నారు. వారి దరఖాస్తులను కూడా త్వరలో స్వీకరించి చేయూత పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో కొత్తగా 3,812 పెన్షన్లు మంజూరయ్యాయని, మరో 1,533 దరఖాస్తులు 360 డిగ్రీల కోణంలో పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. వాటిలో 200కు పైగా దరఖాస్తుదారులు అర్హులుగా తేలినందున వారికి కూడా పెన్షన్లు మంజూరు చేసేలా కమిషనర్, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ తిరస్కరణకు గురైన దరఖాస్తులను మరోసారి పరిశీలించి అర్హులకు చేయూత అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో, నవంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ విభాగాన్ని పరిశీలించి, ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, పరిష్కారానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను శ్రద్ధగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు.అనంతరం పోలీసుల పనితీరును సమీక్షిస్తూ, ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా సెక్టార్ అధికారుల బాధ్యతలను వివరిస్తూ, తమ పరిధిలోని ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణతో పాటు ప్రజలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు.
క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.
కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

రైతు సంక్షేమం.. సత్తుపల్లి సమగ్ర అభివృద్ధే లక్ష్యం.!







- **రూ.10.80 కోట్లతో వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.**
- **సంక్రాంతి నాటికి వేశ్యాకాంతల చెరువుకు గోదావరి జలాలు.**
- **సత్తుపల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో మంత్రి తుమ్మల.**

సత్తుపల్లి, నవంబరు 16 (తెలంగాణ ముచ్చట్లు): రైతుల సంక్షేమం, ప్రజల అభ్యున్నతి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్‌ను ఖమ్మం మార్కెట్ తరహాలో ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. సోమవారం సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో రూ.10.80 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం చల్లగుల్ల నరసింహారావు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత 45 ఏళ్లుగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. రాజకీయంగా ఎన్ని మార్పులు వచ్చినా ప్రజలు, నాయకులు తనను ఆదరిస్తూ ముందుకు నడిపించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో ఆరు మండలాలతో కూడిన సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన దేవాదుల, దుమ్ముగూడెం ప్రాజెక్టులు నిలిచిపోయినప్పటికీ, సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చామని తెలిపారు. ఇప్పటికే పలు చెరువుల ద్వారా ఆయకట్టుకు నీరందిస్తున్నామని, రాబోయే సంక్రాంతి పండుగ నాటికి వేశ్యాకాంతల చెరువుకు కూడా గోదావరి జలాలు అందిస్తామని స్పష్టం చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకుని, మే నెల నాటికి మరిన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణంతో ఈ ప్రాంతంలో పామాయిల్ సాగుకు మరింత ప్రోత్సాహం లభించిందన్నారు. ఇప్పటికే మూడు వేల ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతుండగా, మరో మూడు వేల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు ముందుకొస్తున్నారని తెలిపారు. పామాయిల్ రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పామాయిల్‌తోపాటు కోకో, మిరియాలు వంటి ఉద్యాన పంటలను సాగు చేస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సత్తుపల్లి ప్రాంతంలో రవాణా సౌకర్యాల మెరుగుదలకు విమానాశ్రయం, భద్రాద్రి రాముడి క్షేత్రానికి రైల్వేలైన్, సత్తుపల్లి మీదుగా కోవూరు, కొండపల్లికి రహదారుల అభివృద్ధి వంటి లక్ష్యాలున్నాయని మంత్రి వెల్లడించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ తరహాలో సత్తుపల్లి మార్కెట్‌ను కూడా ఆధునిక సౌకర్యాలతో ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. పార్టీ విజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పించడం కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. అందులో భాగంగానే సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చల్లగుల్ల నరసింహారావుకు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. నూతన పాలకవర్గం రెండేళ్ల పదవీకాలంలో మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆరు గ్యారెంటీలతోపాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్తు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసినట్లు తెలిపారు. నవంబరు 19 నుంచి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుందని, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి, సత్తుపల్లి నియోజకవర్గంలో 4,700 మందికి ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత, చేనేత కార్మికుల పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించామని, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన వారందరికీ ఇళ్లు అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొడుతూ ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిల్లో పార్టీ కమిటీలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన ప్రజాదరణ ఉందని, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే రానున్న ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. గతంలో తీన్మార్ మల్లన్నను గెలిపించిన తరహాలోనే కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తద్వారా నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌రాజ్, ఉప సంచాలకులు వి.పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఆర్.సంతోష్‌కుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా బేగం, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు రోజులు గడిచినా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలేవీ?

- **దళారుల చేతికి ధాన్యం వెళ్లాకే కేంద్రాలు ఏర్పాటు చేస్తారా..? అధికారుల తీరుపై రైతుల ఆవేదన**

వేలేరు, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): వేలేరు మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఆరు రోజులు గడుస్తున్నప్పటికీ మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొచ్చి ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ధాన్యం మొత్తం దళారుల చేతికి వెళ్లిపోయిన తర్వాత ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారా? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.కేంద్రాలు ఏర్పాటు చేయక రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.





నార్కోటిక్ డాగ్‌తో పోలీసుల మెరుపు తనిఖీలు

- **గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం.**
- **మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవు**
- **ఎస్.ఐ కాంత్రికుమార్**


ఇల్లందకుంట, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇల్లందకుంట, సీతంపేట గ్రామాల్లో నార్కోటిక్ డాగ్ సహాయంతో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, పాన్‌షాపులను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ కాంత్రికుమార్ మాట్లాడుతూ గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించినా, వినియోగించినా, రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని, ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు, సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు గుర్తించినా, అలాంటి వారి సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలకు సూచించారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాజుల కాంతులతో వెలిగిన ముత్యాలమ్మ ఆలయం

- **కార్తీక మాసం సందర్భంగా అమ్మవారికి లక్ష గాజులతో విశేష అలంకరణ.. ప్రత్యేక పూజలు.**



తల్లాడ, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైరా రోడ్డులోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ రంగుల గాజులతో ముస్తాబైన అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కార్తీక మాసం సందర్భంగా అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతూ భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.


అప్పీలేట్ అథారిటీ ఆదేశాలకూ బేఖాతర్!

- **వీణవంక పీఐఓ తీరుపై సమాచార కమిషన్‌కు రెండో అప్పీల్**
- **మూడు నెలలైనా అందని సమాచారం.. అధికారుల నిర్లక్ష్యంపై బాధితుడి ఫిర్యాదు**



వీణవంక, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నప్పటికీ సమాచారం అందించకపోవడం, మొదటి అప్పీలేట్ అథారిటీ ఆదేశాలను సైతం అమలు చేయకపోవడంపై కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన జూన్తుల జనార్దన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై న్యాయం కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. జూన్తుల జనార్దన్ రెడ్డి 2026 ఆగస్టు 18న సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6(1) కింద వీణవంక మండల రెవెన్యూ ప్రజా సమాచార అధికారికి (పీఐఓ) ఏడు అంశాలకు సంబంధించిన సమాచారం కోరుతూ దరఖాస్తు సమర్పించారు. చట్ట ప్రకారం 30 రోజుల్లో సమాచారం అందించాల్సి ఉన్నప్పటికీ గడువు ముగిసినా అధికారులు స్పందించలేదు. దీంతో సెప్టెంబర్ 22న సమాచార హక్కు చట్టం సెక్షన్ 19(1) కింద హుజురాబాద్ రెవెన్యూ డివిజన్ అప్పీలేట్ అథారిటీకి మొదటి అప్పీల్ దాఖలు చేశారు.

దీనిపై విచారణ చేపట్టిన అప్పీలేట్ అథారిటీ అక్టోబర్ 1న ఫైల్ నంబర్ N/1519/2026 ద్వారా కోరిన సమాచారాన్ని అందించాలని సంబంధిత పీఐఓకు ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఏడు అంశాలకు సంబంధించిన సమాచారం, రికార్డుల ప్రతులు అందకపోవడంతో బాధితుడు మరోసారి న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జనార్దన్ రెడ్డి తరపున అదే గ్రామానికి చెందిన రేగుల సంపత్ నవంబర్ 16న హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయానికి వెళ్లి సమాచార హక్కు చట్టం సెక్షన్ 19(3) కింద రెండో అప్పీల్ దరఖాస్తును సమర్పించారు. కమిషన్ అధికారులు దరఖాస్తును స్వీకరించారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 18న సమాచారం కోసం దరఖాస్తు చేసుకుని మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి ఆదేశాలు జారీ చేసినప్పటికీ కింది స్థాయి అధికారి వాటిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సామాన్య ప్రజలకు సమాచారం అందించడం అధికారుల బాధ్యత అని, సమాచార కమిషన్ తమకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.



ఏఎస్సైగా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ

ఖమ్మం బ్యూరో, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులు డి.కొండయ్య, టి. వెంకటేశర్లు, వి.నరసింహారావు ఎన్. హరిప్రసాద్, వి.జయరాజులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం,వరంగల్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాద్ పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 17 - నవంబర్ 2026
వరంగల్ 07

యువత మత్తు మాయలో పడొద్దు.!

- బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.
- పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి: సీఐ సర్వయ్య.



కల్లూరు, నవంబరు 16 (తెలంగాణ ముచ్చట్లు): యువత మత్తు పదార్థాల మాయలో పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సత్తుపల్లి రూరల్ సీఐ సర్వయ్య సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సోమవారం కల్లూరు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సర్వయ్య మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నివారణ అనేది సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి విద్యార్థులు తమ విలువైన జీవితాలను, భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలుసుకోవడంతో పాటు, తమ తోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితులు, రోజువారీ కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ సర్వయ్య పిలుపునిచ్చారు.

మోజర్లలో టీబీ వ్యాధి గుర్తింపునకు ప్రత్యేక వైద్య శిబిరం



పెద్దమందడి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ (క్షయవ్యాధి) నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందే విధానం, నివారణ చర్యల గురించి ఆరోగ్య సిబ్బంది వివరించారు. టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు.రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి తగ్గడం, శరీర బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు.టీబీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వ్యాధిపై అపోహలు వీడి అవగాహన పెంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది పిలుపునిచ్చారు.ఈ వైద్య శిబిరంలో మధు, బాలకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ లలిత, ఆశా కార్యకర్త గిరిజ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహం.. తీరని విషాదం!

- అత్త మందలించిందని వివాహిత ఆత్మహత్య.. రెండున్నరేళ్ల బాబుకు తీరని అన్యాయం
- బాబుకు సిరప్ పట్టించే విషయంలో అత్తాకోడళ్ల మధ్య వివాదం
- మందలింపుతో తీవ్ర మనస్తాపానికి గురైన సత్య శ్యామలాంబిక
- నాలుగేళ్ల క్రితమే వివాహం.. రెండున్నరేళ్ల కుమారుడు
- చిన్న చిన్న గొడవలకే ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు
- కుటుంబ సభ్యుల మధ్య సహనం, సంయమనం అవసరమంటున్న నిపుణులు





రాజమహేంద్రవరం, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): కుటుంబంలో జరిగే చిన్నపాటి గొడవలు ఒక్కోసారి ఊహించని విషాదాలకు కారణమవుతున్నాయి. క్షణికావేశం, మనస్తాపంతో తీసుకునే తొందరపాటు నిర్ణయాలు ఒక వ్యక్తి జీవితాన్నే కాదు.. అతడిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తును కూడా చీకట్లోకి నెట్టేస్తున్నాయి. తాజాగా తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం శ్రీరామ్‌నగర్‌లో చోటుచేసుకున్న వివాహిత ఆత్మహత్య ఘటన కలకలం రేపుతోంది. అత్త మందలించిందనే మనస్తాపంతో సత్య శ్యామలాంబిక ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. బాబుకు సిరప్ పట్టించే విషయంలో అత్తాకోడళ్ల మధ్య వివాదం తలెత్తగా, ఆ తర్వాత జరిగిన పరిణామాలు విషాదానికి దారితీసినట్లు తెలుస్తోంది.

నాలుగేళ్లకే ముగిసిన వైవాహిక జీవితం!

శ్యామలాంబికకు నాలుగేళ్ల క్రితమే వివాహమైంది. ఈ దంపతులకు రెండున్నరేళ్ల కుమారుడు ఉన్నాడు. భర్త వీరపణి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కుటుంబంలో బాబుకు మందు పట్టించే విషయంలో అత్తతో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో అత్త మందలించడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. అనంతరం ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. చిన్నారి భవిష్యత్తు, కుటుంబ సభ్యుల పరిస్థితి తలచుకుంటే ఈ ఘటన ఎంతటి విషాదాన్ని మిగిల్చిందో అర్థమవుతుంది. అసలు ఏం జరిగింది? వివాదం ఏ స్థాయికి చేరింది? అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్షణికావేశం.. జీవితాంతం తీరని లోటు!

ఇటీవలి కాలంలో కుటుంబ కలహాలు, దాంపత్య సమస్యలు, అత్తాకోడళ్ల మధ్య విభేదాలు, ఆర్థిక ఇబ్బందులు వంటి కారణాలతో కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. చిన్న విషయాలకే వాగ్వాదాలు పెరగడం, ఒకరినొకరు నిందించుకోవడం, మాటలతో బాధపెట్టడం కుటుంబ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. సమస్య ఎంత పెద్దదిగా కనిపించినా దానికి పరిష్కారం ఆత్మహత్య కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆ క్షణంలో కలిగే ఆవేదన శాశ్వతం కాదు. కానీ ఆవేశంలో తీసుకునే నిర్ణయం మాత్రం కుటుంబ సభ్యులకు జీవితాంతం తీరని వేదనను మిగులుస్తుంది.

అత్తాకోడళ్లు.. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి!

కుటుంబంలో భిన్నమైన ఆలోచనలు, అభిప్రాయాలు ఉండటం సహజం. అయితే వాటిని గొడవలుగా మార్చకుండా పరస్పర గౌరవంతో మాట్లాడుకోవాలి. అత్తలు కోడళ్లను మందలించే సమయంలో వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. కోడళ్లు కూడా కుటుంబ సభ్యుల మాటలను వ్యక్తిగత అవమానంగా భావించకుండా ప్రశాంతంగా సమస్యను వివరించాలి. భార్యాభర్తలు ఒకరికొకరు అండగా నిలవాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న కుటుంబాల్లో పెద్దల మధ్య గొడవలు వారి మానసిక పరిస్థితిపై కూడా ప్రభావం చూపుతాయని గుర్తించాలి. ఏదైనా సమస్య తలెత్తితే కుటుంబంలోని పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పాలి.

ఆత్మహత్య పరిష్కారం కాదు.. ఆప్యాయతే అసలైన అండ!

ఎవరైనా తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కనిపిస్తే వారిని ఒంటరిగా వదిలేయకూడదు. వారి బాధను తక్కువగా చూడకుండా ఓపికగా వినాలి. ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు వ్యక్తం చేస్తే వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకోవాలి. అవసరమైతే అత్యవసర వైద్య సహాయం అందించాలి. సమస్యలు ఎదురైనప్పుడు స్నేహితులు, బంధువులు, నమ్మకమైన వ్యక్తులతో మాట్లాడటం ఎంతో ఉపయోగపడుతుంది. జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు ఏదో ఒక పరిష్కారం ఉంటుంది. చిన్న చిన్న గొడవల కారణంగా విలువైన ప్రాణాలను కోల్పోవద్దు. కుటుంబ సభ్యులందరూ ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఆప్యాయతతో వ్యవహరించాలి. ఒకరి మాట మరొకరికి బాధ కలిగించకుండా చూసుకోవాలి. ఒక్క క్షణం ఆగి ఆలోచిస్తే ఎన్నో కుటుంబాల్లో ఇలాంటి విషాదాలను నివారించవచ్చు.

అర్హులైన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించాలి: జి.వి. కిరణ్ కుమార్

- ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల పదోన్నతులపై సమీక్ష
- టైమ్ రేటెడ్, క్యాడర్ స్కీమ్ అమలుపై సూచనలు

హైదరాబాద్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): సింగరేణి సంస్థలో అర్హులైన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించాలని జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం జి.వి. కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అలాగే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు లాభాల బోనస్ వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి అన్ని ఏరియాల పర్సనల్ విభాగం అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏరియాల వారీగా ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియపై కిరణ్ కుమార్ సమీక్షించారు. అర్హులైన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు టైమ్ రేటెడ్, క్యాడర్ స్కీమ్ కింద పదోన్నతులు కల్పించడంలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఉద్యోగులకు నిర్దిష్ట సమయంలో పదోన్నతులు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని పర్సనల్ విభాగం అధికారులకు సూచించారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చెల్లించాల్సిన లాభాల బోనస్ అంశంపైనా సమావేశంలో చర్చించారు. ఇప్పటివరకు బోనస్ చెల్లించని కాంట్రాక్టర్లతో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న మొత్తాలను వెంటనే కార్మికులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మికులకు రావాల్సిన బోనస్ చెల్లింపుల్లో మరింత జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించాలని కిరణ్ కుమార్ సూచించారు. పదోన్నతుల ప్రక్రియ, బోనస్ చెల్లింపుల విషయంలో ఏరియాల వారీగా పురోగతిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీఎం (పర్సనల్)లు ఎస్. వెంకటేశ్వరరావు, బి. రాజగోపాల్, డీవైపీఎం వి. దేవేందర్ రెడ్డితో పాటు అన్ని ఏరియాల పర్సనల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రేమ శిఖరాలు

జీవితంలో నువ్వు కొని కట్టుకున్న
కొత్త వస్త్రాలకంటే
నా చదువుల అప్పుకు కట్టిన వడ్డీ
పాట్లాలే ఎక్కువ నాన్న

ఆప్తుడు ఇచ్చే అప్పకోసం
అర్ధాకలితో కంచంలో కడిగేసిన
నీ చెయ్యి


పరుగు పెట్టిన నీ కాళ్ళకు నే చేసే
వందనం ఏ దేవుడి సాష్టాంగ
నమస్కారానికి సమానం నాన్న

ప్రక్కటెముకలు పిక్కటిల్లే
పురిటినొప్పుల సాహసం
నా తొలి అడుగు కోసం తపించి
వెదకిన నీ కనుల చల్లని చూపు

తప్పటడుగులో తల్లడిల్లి అన్ని
వైపుల అండగా నిలిచిన నీ
అభయహస్తం
ఏ దేవత ప్రదక్షిణల నుండి
పొందగలను అమ్మ

తప్పడడుగులో క్షమించి
సరిచేసిన షరతులు లేని
మీ ప్రేమ
నా అనారోగ్యంలో అలసిపోక
ఆదరించిన మీ దయకు
భువిపై ఏ దేవీ దేవతలు
కొలువుండే శిఖరాలు సమానం
కాగలవు అమ్మా నాన్న.

నా తల్లి తండ్రులు నేపా బేబీ
సత్యనారాయణ గారికి అందరి
తల్లి తండ్రులకు ప్రేమతో.....




- నేపా సంతోష్ అచ్యుత్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత.8639442397

జాతీయ పత్రికా దినోత్సవం వేళ విలేకరులకు దక్కని గుర్తింపు

- పెద్దమందడి మండలంలో పత్రికా విలేకరుల పట్ల నాయకుల నిర్లక్ష్యంపై చర్చ



పెద్దమందడి,నవంబర్16(తెలంగాణ ముచ్చట్లు): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో పత్రికా విలేకరులకు తగిన గుర్తింపు, గౌరవం దక్కలేదనే అభిప్రాయాన్ని రిపోర్టర్ బండి రాజు వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రభుత్వ కార్యక్రమాలు, నాయకుల కార్యకలాపాలను ప్రజలకు తెలియజేయడంలో విలేకరులు నిరంతరం కృషి చేస్తున్నారు. అయినప్పటికీ వారి సేవలను గుర్తించి అభినందించే విషయంలో కొందరు నాయకులు తగిన చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇదే సమయంలో పక్కనే ఉన్న ఖిల్లా ఘణపురం మండలంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నాయకులు విలేకరులను శాలువాలతో సత్కరించి గౌరవించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఒక మండలంలో విలేకరుల సేవలను గుర్తించి సన్మాన కార్యక్రమం నిర్వహించగా, పెద్ద మందడి మండలంలో మాత్రం అలాంటి కార్యక్రమం జరగకపోవడం చర్చనీయాంశంగా మారింది. పక్క మండలంలో లభించిన గౌరవం, పెద్దమందడిలో ఎందుకు దక్కలేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తమ కార్యక్రమాలకు ప్రచారం అవసరమైనప్పుడు విలేకరులను సంప్రదించే నాయకులు, వారి వృత్తిపరమైన గౌరవం, గుర్తింపు విషయంలోనూ అదే శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వార్తల ప్రచురణ కోసం విలేకరులను ఆశ్రయించే వారు, వారి సేవలను గుర్తించే సందర్భాల్లోనూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.విలేకరులు ఎండనక, వాననక క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, తమ సమయాన్ని, సొంత ఖర్చులను వెచ్చించి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజానికి సమాచారాన్ని అందిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న పత్రికా రంగానికి చెందిన వారి సేవలను గుర్తించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత.జాతీయ పత్రికా దినోత్సవం వంటి సందర్భాలు కేవలం శుభాకాంక్షలకే పరిమితం కాకుండా, జర్నలిస్టుల సేవలను గుర్తించి గౌరవించేందుకు వేదికలుగా మారాలి. విలేకరులు కేవలం వార్తల ప్రచురణకే పరిమితం కాదని, ప్రజల పక్షాన నిలిచి పనిచేసే బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్నారని నాయకులు గుర్తించాలని పలువురు కోరుతున్నారు. ప్రచారం కోసం మాత్రమే కాకుండా, పత్రికా విలేకరుల వృత్తిపరమైన గౌరవానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

భారత్ సమ్మిట్‌లో వ్యాఖ్యలపై డీజీపీకి బీజేపీ ఫిర్యాదు

- విదేశీ రాజకీయ ప్రతినిధి వ్యాఖ్యలపై అభ్యంతరం
- భారత ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రశ్నించడంపై ఆగ్రహం
- కాంగ్రెస్ వైఖరిని తప్పబట్టిన రామచందర్‌రావు
- మరిన్ని చర్యలు తీసుకుంటామని ప్రకటన



హైదరాబాద్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): భారత్ సమ్మిట్‌లో భారత ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను ఉద్దేశించి విదేశీ రాజకీయ ప్రతినిధి చేసిన వ్యాఖ్యల పై తెలంగాణ బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసింది. భారత గడ్డపై నిలబడి దేశ రా జ్యాంగ, ప్రజాస్వామ్య ప్రక్రియలను ప్రశ్నించడం సమంజసం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తీవ్రంగా స్పందించారు.


భారత్ సమ్మిట్‌కు హాజరైన విదేశీ రాజకీయ ప్రతినిధి భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు దేశ గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని రామచంద ర్‌రావు ఆరోపించారు. భారతదేశంలో జరిగే కార్యక్రమానికి వచ్చి దేశ రాజ్యాంగ వ్యవస్థను, ప్రజాస్వామ్య ప్రక్రియలను బహిరంగంగా ప్రశ్నించే అధికారం ఆయనకు ఎవరిచ్చారని నిలదీశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.

ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరుపైనా రామచందర్‌రావు విమర్శలు గుప్పించారు. విదేశీ ప్రతినిధి భారత ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు చప్పట్లు కొట్టడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని కించపరిచే వ్యాఖ్యలను సమర్థించడం ద్వారా కాంగ్రెస్ భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై విమర్శలు చేయడం ఒక అంశమైతే, విదేశీ ప్రతినిధి వ్యాఖ్యలకు మద్దతుగా నిలవడం మరో అంశమని అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను దేశంలోనే అవమానించేలా వ్యాఖ్యలు చేసినా ఊరుకునేది లేదని రామచందర్‌రావు స్పష్టం చేశారు. దేశ గౌరవం, రాజ్యాంగ వ్యవస్థల విషయంలో బీజేపీ రాజీ పడబోదని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని తేలికగా తీసుకునే ప్రసక్తే లేదని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.

భారత్ సమ్మిట్‌లో చోటుచేసుకున్న వ్యాఖ్యలు, వాటిపై కాంగ్రెస్ స్పందనకు సంబంధించి మరిన్ని చర్యలు తీసుకుంటామని రామచందర్‌రావు ప్రకటించారు. భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని పేర్కొన్నారు. ఈ అంశంపై బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, అవసరమైన తదుపరి చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు.

ప్రజల పన్నుల డబ్బుతోనే సంక్షేమ పథకాలు

- ఘట్‌కేసర్‌లో నూతన పింఛన్ల ప్రాసీడింగ్స్ పంపిణీ
- లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు
- ఆరేళ్లుగా నిలిచిన పింఛన్లు ఇప్పటికైనా అందడం సంతోషకరం
- డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని డిమాండ్
- చేయూత పింఛన్ల పంపిణీలో ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు..



ఘట్‌కేసర్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రాసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం ఘట్‌కేసర్‌లోని బంధన్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ మనూ చౌదరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ..గత ఆరు, ఏడు సంవత్సరాలుగా పింఛన్లు నిలిచిపోయిన కొందరు లబ్ధిదారులకు ఇప్పటికైనా తిరిగి పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమని అన్నారు. దీర్ఘ కాలంగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ఈ నిర్ణయం కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు. పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, జీవనోపాధికి ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితుల్లో ఉన్నవారికి భరోసా కల్పించే పథకమని అభిప్రాయపడ్డారు. కొత్తగా పింఛన్లు పొందుతున్న మహిళలు, దివ్యాంగులకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలపై మాట్లాడిన ఈటల రాజేందర్..పింఛన్లు ఎవరు ఇచ్చినా అవి ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా సమకూరిన డబ్బేనని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వసూలయ్యే పన్నులతోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, ఆ నిధులను తిరిగి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఏ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసినా, సంక్షేమ పథకం అమలు చేసినా అది ప్రజల సొమ్ముతోనే జరుగుతుందని అన్నారు. ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలను ఎవరో వ్యక్తిగతంగా తమ సొంత డబ్బు నుంచి ఇస్తున్నట్లు భావించకూడదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పనుల ప్రస్తావనకు వస్తూ.. ప్రాంతంలో వంతెన నిర్మాణం కోసం రూ.105 కోట్ల విలువైన ప్రభుత్వ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకొచ్చినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. ఈ నిర్మాణానికి కేటాయించే నిధులు కూడా ప్రజలు చెల్లించిన పన్నుల నుంచే సమకూరుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత అని, ప్రజాధనాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించాల్సిన అవసరం ఉందని అన్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ప్రాంత అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానిక అర్హులైన నిరుపేదలకే కేటాయించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న స్థానిక కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కేటాయింపుల విషయంలో అర్హతకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. పింఛన్లు, ఇళ్లు, మౌలిక వసతులు వంటి ప్రజా అవసరాల విషయంలో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పింఛన్ ప్రొసీడింగ్స్ అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యాలయం వేదిక కావాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్కతుర్తిలో మండల కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం
- ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలి
- మండలంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం



హనుమకొండ, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనిచేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసే వేదికగా పార్టీ కార్యాలయం నిలవాలని సూచించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందేలా ఈ కార్యాలయం క్రియాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రి వెల్లడించారు. గ్రామాల అవసరాలను గుర్తించి రహదారులు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు అన్ని ప్రాంతాలకు చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎల్కతుర్తి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రహదారుల నిర్మాణం, ఆసుపత్రి, కోర్టు, బస్టాండ్, 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం వంటి కీలక పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మండల ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని చురుకైన పాత్ర పోషించాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల సమాచారం అందించడంతో పాటు వాటి అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించాలని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసే కేంద్రంగా ఉండాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్‌లో రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
- నగరంలో నీటి సమస్య లేదనడం వాస్తవ విరుద్ధం
- నవంబర్‌లోనే బోర్లు ఎండిపోయాయని వెల్లడి
- మార్చి నాటికి పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే విమర్శలు




హైదరాబాద్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో నీటి సమస్య లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారని, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి కష్టాలు రాబోతున్నాయని ప్రజలను హెచ్చరిస్తున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు నీటి సమస్యపై పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ముఖ్యమంత్రి మాటలు నమ్మాలో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్న విషయాలను నమ్మాలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు.

వేసవిలో తలెత్తే నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలో కేసీఆర్ ముందుగానే ప్రణాళికలు రూపొందించేవారని సుధీర్ రెడ్డి గుర్తుచేశారు. హైదరాబాద్‌లో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ ముందుగానే హెచ్చరించారని తెలిపారు. ప్రస్తుతం నగరంలో నీటి పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందని, నవంబర్ నెలలోనే పలు ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయాయని చెప్పారు. సింగూరు, మంజీర జలవనరులు పూర్తిగా ఎండిపోయాయని, ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఇప్పటికే 2.33 లక్షల ట్యాంకర్ల బుకింగ్‌ల వరకు పరిస్థితి చేరిందని సుధీర్ రెడ్డి వెల్లడించారు. మార్చి నెలలో నగరంలో నీటి సమస్య తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందనే అంచనాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నీటి వినియోగం పెరిగిందని, నగరంలో నీటి కొరతపై అధికారులు సరైన ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా చేసినప్పుడు, సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పారని గుర్తుచేశారు.

మేడిగడ్డను సందర్శించిన సమయంలో తమపై ముఖ్యమంత్రి పరుష పదజాలంతో మాట్లాడారని సుధీర్ రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను విమర్శించడంపైనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్కువ దృష్టి పెడుతోందని ఆరోపించారు. నీటి సమస్యపై ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించాలని, హైదరాబాద్‌లో నీటి కొరత ఉంటే గ్లోబల్ సమ్మిట్ నిర్వహించడానికి వచ్చిన అతిథులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా లభిస్తున్న శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు విక్రయిస్తున్నారని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ పేరుతో రాజకీయాలు చేస్తోందని సుధీర్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ఎవరి ఫోన్లనూ ట్యాప్ చేయలేదని, బీఆర్ఎస్ నాయకుల ఫోన్లనే ప్రస్తుత ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శిస్తూ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



గవర్నర్‌తో జర్మనీ రాయబారి భేటీ

- లోక్‌భవన్‌లో మర్యాదపూర్వక సమావేశం
- భారత్-జర్మనీ సంబంధాల బలోపేతంపై చర్చ
- పరస్పర సహకారానికి మరిన్ని అవకాశాలపై అభిప్రాయాల మార్పిడి
- తెలంగాణతో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం

హైదరాబాద్, నవంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో భారతదేశంలోని జర్మనీ రాయబారి డాక్టర్ జాస్పర్ వీక్ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి మాధవ్ ఆర్. సల్పులే, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరస్పర ఆసక్తి ఉన్న పలు అంశాలపై వారు చర్చించారు. భారత్, జర్మనీ దేశాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే అంశంపై సమావేశంలో అభిప్రాయాలు పంచుకున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఇప్పటికే కొనసాగుతున్న సత్సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పరస్పర భాగస్వామ్యం అవసరమని చర్చించారు.

ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంతో జర్మనీ సంబంధాలను మరింత విస్తరించే అవకాశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంతో వివిధ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. తెలంగాణకు, జర్మనీకి మధ్య మరింత బలమైన అనుబంధం ఏర్పడేలా భవిష్యత్తులో చేపట్టగల కార్యక్రమాలపై అభిప్రాయాలను మార్పిడి చేసుకున్నారు. ఈ భేటీలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, జర్మనీ రాయబారి జాస్పర్ వీక్‌తో పాటు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి మాధవ్ ఆర్. సల్పులే, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. భారత్‌జర్మనీ మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను రాష్ట్ర స్థాయిలోనూ మరింత విస్తరించేందుకు ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in